

**'స్వచ్ఛత'లో అందరి భాగస్వామ్యం**
జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. - 8లో



**శివశివమూర్తివి గణనాథా..!**
కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. - 8లో



**అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలు**
కుప్పంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పనులకు దర్జాగా చెరువు మట్టిని టీడీపీ నాయకులు కొల్లగొడుతున్నారు. - 8లో

## వైద్య విద్యార్థులకు అన్యాయం



ఉద్దేశ పూర్వకంగానే వైద్య విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. సమీపంలో ఉన్న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మెడికల్ కళాశాల పనులు 75 శాతం పూర్తయ్యాయి. కళాశాల ప్రారంభించేందుకు జిల్లా ఆసుపత్రిలో అదనపు భవనాల నిర్మాణం జరిగినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యార్థులకు అన్యాయం చేస్తోంది. గత ప్రభుత్వం ఈ ఏడాది ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, వాటిని కూటమి ప్రభుత్వం కావాలనే ప్రారంభించకుండా ప్రయత్నిస్తోంది. దాదాపు 750 మెడికల్ సీట్లు విద్యార్థులు నష్టపోయేలా చేసింది. వైద్య శాఖా మంత్రి గత ప్రభుత్వాన్ని, గత సీఎంను విమర్శిస్తూ ఇటీవల వ్యాఖ్యలు చేయడం బాధాకరం.

– సురేంద్ర, విద్యార్థి తండ్రి, ఐరాల




## ప్రైవేటీకరణ సరికాదు



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదు. గత ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని కొత్తగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమేమో ప్రైవేటీకరణ చేస్తోంది. ఇది ఎంత వరకు సమంజసమో కూటమి నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. మెడికల్ కాలేజీలు నిర్మిస్తే నీట్ పరీక్ష రాసిన దాదాపు 5 లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందనే ఆశతో ఉన్నారు. వారి ఆశల్ని కూటమి ప్రభుత్వం నీరు గార్చింది.

– సాయి, నీట్ విద్యార్థి, చిత్తూరు

## న్యూస్‌రీల్

### ప్రభుత్వాస్పత్రిని జేసీ తనిఖీ



ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేస్తున్న జేసీ విద్యాధరి

**బంగారుపాళెం:** స్థానిక ప్రభుత్వాస్పత్రిని మంగళవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణాన్ని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషకు సూచించారు. ఆక్సిజన్ ప్లాంట్ పరిశీలించి పనిచేస్తోందా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో మరమ్మతులకు గురై ఏళ్లకాలంగా నిరుపయోగంగా ఉన్న 108 అంబులెన్సును తరలించాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఈ నెల 19న మంత్రి లోకేష్ ప్రారంభించనున్న డయాలసిస్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### అంటు కట్టిన కూరగాయ మొక్కలతో అధిక ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు


**కుప్పం:** కూరగాయ పంటల సాగులో అంటు కట్టిన మొక్కలతో రైతులు అధిక ఆదాయం గడించవచ్చని రాష్ట్ర ఉద్యానవనశాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు అన్నారు. కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో(సీఓఈ) కూరగాయల నారును అంటుకట్టడం, మట్టి లేకుండా నీటితో హైడ్రోఫోనిక్ సాగుపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో కూరగాయల నారుకు అంటుకట్టే విధానం కేవలం కుప్పం సీఓఈలో మాత్రమే ఉందన్నారు. దీని ద్వారా ఏపీ, తమిళనాడు, కర్ణాటక రైతులు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ప్రతి ఏటా ఇక్కడ దాదాపు కోటి నారు మొక్కలు ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి శిక్షణకు వచ్చిన సీఓఈ నోడల్ ఆఫీసర్లు ఇక్కడి విధానంపై అవగాహన పెంచుకుని వారి రాష్ట్రాల్లో వ్యాప్తి చేయాలని సూచించారు. అనంతరం పిడినత్తం, కమతమూరు, శెట్టిబల్ల, చెల్దిగానిపల్లె, దాసేగానూరుల వద్ద ఉద్యాన పంటలను, పట్టు సాగును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి, ఇజ్రాయెల్ ఎంబసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ బ్రహ్మదేవ్, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, హార్టికల్చర్ ఏడీలు కోటేశ్వరరావు, శ్రీకాంత్ ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

### 'పర్యాటక' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**చిత్తూరు కలెక్టరేట్:** ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని పర్యాటక ఎక్స్‌లెన్స్ పురస్కారాలకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. పర్యాటక ఎక్స్‌లెన్స్ పురస్కారాలకు టూర్స్, ట్రావెల్స్, హోటల్, సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 22వ తేదీలోపు జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు.

### బోధనతో భవితకు పునాది

– టీచర్లతో డీఈఓ దేవరాజులు



సీఆర్‌సీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజులు

**బంగారుపాళెం:** విద్యార్థులకు సులువుగా, అర్థవంతంగా విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుండ్లకట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఆర్‌సీ శిక్షణ కార్యక్రమాన్ని డీఈఓతో పాటు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్లతో డీఈఓ మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల భవితకు టీచర్లు తమ బోధనతో బలమైన పునాది వేయాలన్నారు. రాయడం, చదవడం వంటి చతుర్విధ ప్రక్రియలను నేర్పించాలన్నారు. పీడీ మాట్లా డుతూ, విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రా వు, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమంటూ సంఘీభావం తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు

# సర్కారు మెడలు వంచుదాం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. పేద విద్యార్థులు డాక్టర్లు కావాలనే కలలను తుంచేస్తోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసి 17 కళాశాలలను ప్రైవేటు పరం చేసి కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ ఎంబీబీఎస్ విద్యను ఉన్నత వర్గాలకే పరిమితం చేసే కుట్రకు పాల్పడుతోంది. వైద్య విద్య ప్రైవేటీకరణ, సీట్లలో కోత విధించిన చంద్రబాబు సర్కారును మెడలు వంచేందుకు చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల విద్యార్థి యువజన సంఘాల నేతలు సిద్ధమయ్యారు.

- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- నిరంకుశ పాలనపై కలిసికట్టుగా పోరాడుదాం
- వైద్య విద్య ప్రైవేటీకరణ దారుణం
- డాక్టర్ కావాలన్న పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతున్న పాలకులు
- కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే తిరుగుబాటు తప్పదు
- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలకు విద్యార్థిలోకం సిద్ధం

**తిరుపతి సిటీ:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రైవేటీకరణ మోజులో తరిస్తోంది. కార్పొరేట్ల యావలో పడి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలను నిర్మించడంతో పాటు గతేడాది సుమారు 700 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దగ్గర చేసింది. అయితే ఈసారి కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు అండ్ కో మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడంతో పాటు 700 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయేలా చేసింది. తద్వారా వచ్చే రెండేళ్లలో కూడా వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులు 1400 సీట్లు కోల్పోనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి సీపీఐ కార్యాలయంలో మంగళవారం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సుమారు 15 విద్యార్థి సంఘాలకు చెందిన రాష్ట్రస్థాయి నాయకులు, తిరుపతి, చిత్తూరు జిల్లాల విద్యార్థి, యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు. సమావేశంలో నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసగా ఈనెల 19వ తేదీని తిరుపతి కేంద్రంగా జరిగే ధర్నా, నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నిరంకుశత్వ పాలనను ఎండగట్టి విద్యార్థుల పక్షాన పోరాటాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి డాక్టర్ల సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

### పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతారా ?



డాక్టర్ కావాలని ఎన్నో ఆశలతో వ్యయ ప్రయాసలకోర్చి లక్షలు వెచ్చించి లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న పేద విద్యార్థు ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లడం దారుణం. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వందల సంఖ్యలో ఉచిత సీట్లను కోల్పోయే ప్రమాదం ఉంది. పులివెందుల కళాశాలలో సుమారు 50 ఫ్రీ సీట్లను ప్రభుత్వం రద్దు చేయడం హేయమైన చర్య.

– మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, తిరుపతి

### ప్రభుత్వాన్ని నిలదీద్దాం..



వైద్య విద్యను పేదలకు దూరం చేసే కుట్రలో భాగమే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ. తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో సుమారు 12వేలకు పైగా మెడికల్ సీట్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 6,180 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇందులోనూ ప్రభుత్వం కోత విధించడం దారుణం. అన్ని విద్యార్థి సంఘాలు పోరాటాలకు సిద్ధపడదాం.

– శివారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్, రాష్ట్ర అధ్యక్షులు, తిరుపతి

### నిరంకుశత్వ పాలనను ఎండగడదాం



చంద్రబాబు కార్పొరేట్ వ్యక్తి. గతంలో సీఎంగా ఆయన ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లిషు మీడియంను వ్యతిరేకించి, కార్పొరేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చిన చరిత్ర ఆయనది. డాక్టర్ విద్యను పేదలకు అందని ద్రాక్షలా చేసి బడా బాబులకు దగ్గర చేసే ప్రయత్నంలో భాగమే మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ. విద్యార్థి సంఘాల పోరాటాలతో ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటాం.

– ఓబుల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

### విద్యార్థుల జీవితాలతో ఆటలా...!



రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుతోంది. నీట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎంబీబీఎస్ సీటు రావడం కష్టమవుతుంది. చంద్రబాబు గతంలో మాదిరే కార్పొరేటర్ల కొమ్ము కాసే విధంగా పాలన సాగిస్తున్నారు.

– మల్లికార్జున, ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, తిరుపతి

### నాడు వ్యతిరేకించి.. నేడు ప్రైవేటు పాట



చంద్రబాబు గతంలో 107,108 జీఓలను వ్యతిరేకించారు. కూటమి నేతలు సైతం వంత పాడారు. కానీ అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాట అందుకున్నారు. దీంతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల జీవితాలపై ప్రభావం చూపుతుంది. తక్షణం ప్రైవేటీకరణను, మెడికల్ సీట్ల కోతను ఆపాలి. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమం చేయడం ఖాయం.

– ఆశా, పీడీఎస్‌ఓ, జిల్లా కార్యదర్శి, తిరుపతి

### 1400 సీట్లు కోల్పోయే ప్రమాదం..



రాష్ట్రప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో సుమారు 1400 ఎంబీబీఎస్ సీట్లు రెండు ఏళ్లలో కోల్పోయే ప్రమాదం ఉంది. ఏపీలో డాక్టర్ల సంఖ్య పెద్దఎత్తున తగ్గుముఖం పట్టి కార్పొరేట్ వైద్యం రాజ్యమేలుతుంది. ఇప్పటికైనా బాబు సర్కార్ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తాం.

– కత్తి రవి, ఏఐవైఎఫ్, జిల్లా కార్యదర్శి

### పోరాటాలకు సిద్ధం కండి



రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో పేద విద్యార్థుల ఆశలకు గండి పడుతుంది. పులివెందుల కళాశాలలో 50 సీట్లను ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని సుమారు 140 ఫ్రీ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రతి విద్యార్థి సంఘం అప్రమత్తంగా వ్యవహరించి ప్రభుత్వం దిగొచ్చే వరకూ నిరసనలు కొనసాగిద్దాం.

– అక్బర్, ఎస్‌ఎఫ్‌ఐ, జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

### జీఓలను రద్దు చేయాలి..



విద్యార్థుల కడుపు కొట్టే 107, 108 జీఓలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలి. మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే కుట్రను ఆపాలి. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలో సుమారు 3 వేల సీట్ల వరకు భర్తీ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటు పరం చేసి పేదల కడుపు కొడుతోంది. – చలపతి, ఏఐఎస్‌ఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, తిరుపతి

### పేదల కడుపు కొడితే యుద్ధమే



రాష్ట్రంలో ఎంతోమంది విద్యార్థుల జీవిత ఆశయం డాక్టర్ కావడం. అలాంటి ఆశలపై నీళ్ల చల్లి మెడికల్ సీట్లను అమ్ముకునే విధంగా చంద్రబాబు సర్కారు అడుగులు వేస్తోంది. ఈ ఏడాది సుమారు 700 ఫ్రీ సీట్లు కోల్పోతున్నాం. అంటే 700 భవిష్యత్ డాక్టర్లను ఏపీ కోల్పోతోంది.

– జయచంద్ర, డీవైఎఫ్ఐ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తిరుపతి

# అభివృద్ధిలో పోటీ పడదాం

- రాజకీయం ఎన్నికల్లో చూసుకుందాం
- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి హితవు



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

**చౌడేపల్లి:** మన ప్రాంతాల అభివృద్ధిలో గత ప్రభుత్వం చేసిన దానికంటే ఎక్కువ చేసేందుకు పోటీ పడాలని, రాజకీయం ఎన్నికల సమయంలో మాత్రమే చూసుకోవాలని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి టీడీపీ నాయకులకు హితవు పలికారు. మంగళవారం చౌడేపల్లె పర్యటనకు వచ్చిన ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పుంగనూరు నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే విధంగా కర్ణాటక సరిహద్దు నుంచి చౌడేపల్లె మీదుగా రొంపిచెర్ల క్రాస్ వయా తిరుపతికి నేషనల్ హైవే కోసం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి గతంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిపాదన లేఖను అందజేశామన్నారు. ఈ ప్రాజెక్టు మంజూరుకు పార్లమెంటులో ప్రస్తావించి కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలు పక్కన పెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టాలని, రాజకీయ కక్షలతో దాడులు, కక్ష సాధింపులకు స్వస్తి పలకాలని టీడీపీ నాయకులను కోరారు. మండలంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో బోయకొండ ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయడంతోపాటు శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన అగస్తీశ్వర స్వామి ఆలయానికి రోడ్డు, ఆలయాభివృద్ధికి కృషి చేశామన్నారు. ''టీడీపీ నాయకులకు చెప్పేది ఒక్కటే..అభివృద్ధిలో మాకంటే మీరు బ్రహ్మాండంగా చేయండి.. మా సహకారం ఎప్పుడూ ఉంటుంది.. చంద్రబాబుతో మీరు మాట్లాడండి. అమరావతి రోడ్లే కాదు కర్ణాటక సరిహద్దు నుంచి పుంగనూరు మీదుగా రొంపిచెర్ల క్రాస్‌కు అనుసంధానం అయ్యేలా నేషనల్ హైవే ప్రాజెక్టు మంజూరుకు ఒత్తిడి తెండి'' అని కోరారు. వాటర్ గ్రిడ్ పనులకు పూనుకుని పూర్తిచేస్తే తాగునీటి సమస్య తీరుతుందని, దీనికి గత ప్రభుత్వం అప్పట్లోనే 50 శాతం మేరకు నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ప్రజలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.చిత్తూరు మాజీ ఎంపీ ఎన్. రెడ్డెప్ప, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైఎస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, రెడ్డిప్రకాష్, నాయకులు మిద్దింటి కిషోర్‌బాబు, శ్రీనివాసులురెడ్డి, పద్మనాభరెడ్డి,నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం రేపు

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ స్థాయి సంఘాల కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ గ్లోరియా తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, వ్యవసాయ, స్త్రీశిశు, సాంఘిక సంక్షేమ అంశాలపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీలు హాజరవుతున్నందున సంబంధిత జిల్లా అధికారులు సమాచారంతో సమావేశానికి రావాలని కోరారు.

### నేడు జిల్లాకు మంత్రి నారా లోకేష్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 19న జిల్లాకు రానున్నట్లు బుధవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు అందాయి. ఆయన గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 12.20 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి సాయంత్రం 5 గంటలకు బంగారుపాళ్యానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు బంగారుపాళెంలో కిడ్నీ డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు బంగారుపాళ్యం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి విమానంలో బయలుదేరి విజయవాడకు వెళతారని ఆ షెడ్యూల్లో పేర్కొన్నారు.

### ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు విద్యార్థుల దుర్మరణం




మృతులు మంజునాథ్ , ఆనంద్ బాబు

కుప్పం: మండలంలోని చెరువు కట్టపై ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని పాలిటెక్నిక్ విద్యార్థులు ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన మంజునాథ్ రెడ్డి (18), తంబళ్లపల్లెకు చెందిన ఆనంద్ బాబు (17), మదనపల్లెకు చెందిన పునీత్ కుమార్ (18), కుప్పం పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనల్ డిప్లొమా చదువుతున్నారు. వీరిలో ఆనంద్ బాబుకు చెవి నొప్పి రావడంతో మిత్రుడి ద్విచక్ర వాహనంపై ముగ్గురు పీఈఎస్ మెడికల్ కళాశాలకు వెళ్లి చికిత్స పొందారు. అక్కడి నుంచి తిరిగి కళాశాలకు వస్తుండగా కుప్పం చెరువు కట్ట సర్కిల్‌లో గుడుపల్లె నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకు తరలించగా, అప్పటికే మంజునాథ్, ఆనంద్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పునీత్‌కుమార్ పీఈఎస్ కళాశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

## విద్యార్థుల ఆశలపై నీళ్లు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అందులో భాగంగా వైద్య విద్యను ప్రోత్సహించాలి. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్‌పరం చేయాలని చూడడం బాధాకరం. గత ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో కోట్లాది రూపాయలు వెచ్చించి మెడికల్ కళాశాలలు తీసుకొచ్చింది. అయితే ఈ ప్రభుత్వం రాష్ట్ర వాటాగా వచ్చిన సీట్లను వద్దని వెనక్కి పంపించి విద్యార్థులకు అన్యాయం చేసింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది.

– అమర్‌నాథ్, విద్యార్థి తండ్రి, పూతలపట్టు






## వైద్య విద్యను దూరం చేయడమే

మెడికల్ కళాశాలల నిర్వహణను ప్రైవేట్ పరం చేయడం నిరుపేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయడమే. ఇది మొత్తం రాష్ట్రానికి నష్టం కలగజేస్తుంది. బోధనాస్పత్రుల ద్వారా పేదలకు అందే వైద్యం అందకుండా పోతుంది. ప్రభుత్వం లాభనష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా సేవా దృక్పథంతో ఆలోచించాలి. ప్రభుత్వం స్వయంగానే మెడికల్ కళాశాలలను నిర్వహించాలి. అప్పుడు పేద విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం ఉంటుంది.

– చైతన్య, విద్యార్థి, చిత్తూరు



# 'పక్కా'గా పూర్తి చేయండి

- ఉపాధి హామీ పని దినాల్లో నిర్మాణాలు చేపట్టండి
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం లక్ష్యాలను పూర్తి చేయండి
- వరుస సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడి



పీఎం సూర్యఘర్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఆయన బుధవారం వివిధ శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 28న మన ఇల్లు–మన గౌరవం పేరిట వివిధ దశల్లో అసంపూర్ణంగా ఉన్న ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు చేపడుతూ కార్యక్రమం ప్రారంభించిందన్నారు. ప్రతి గృహ నిర్మాణం పూర్తికి ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పని దినాలను కేటాయించినట్లు చెప్పారు. ఆ పనిదినాలను వినియోగించుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 77,366 మంజూరు కాగా అందులో ఇప్పటి వరకు 47,324 ఇళ్లు పూర్తయినట్లు తెలిపారు.

**పీఎం సూర్యఘర్ యోజన పోస్టర్ల ఆవిష్కరణ**

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పోస్టర్లను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సబ్సిడీతో గృహాల ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు పీఎం సూర్య ఘర్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. గృహ వినియోగదారులు www.pmsuryaghar.gov.in లో రిజిస్టర్ చేసుకొని ప్రభుత్వ రాయితీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు 18,401 నమోదు చేసుకోగా 1,078 దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ తులసి, డీపీఓ లక్ష్మీ, ఎల్‌డీఎం హరీష్, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్ పాల్గొన్నారు.

## చందాల ఘర్షణలో ఏడుగురి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

కుప్పం: వినాయక చవితి పండుగ సందర్భంగా మున్సిపాలిటీలో జరిగిన ఘర్షణల్లో ఏడుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ మునుస్వామి పురానికి చెందిన వినయ్‌పై పట్టణంలో ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌కు చెందిన యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు, నిందితులు బాలమురుగన్, శివ, శ్రావన్ రాజ్, తరుణ్, ఆది, ఉమాశంకర్, జ్ఞానేశ్వర్‌పై హత్యాయత్నం, అట్రాసిటీ యాక్టు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరిని అరెస్టు చేసిన రిమాండ్ తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. వీరితో పాటు బాబు నగర్‌లో రెండు రోజుల క్రితం ఇరు వర్గాలవారు ఘర్షణ పడ్డారు. వారిపైనా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఘర్షణలకు పాల్పడిన యువకులపై రౌడీషీట్ తెరుస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ జీ టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పరస్పరం ఫిర్యాదులు.. కేసుల నమోదు

చిత్తూరు అర్బన్: తనను కులం పేరిట దూషించారని ఒకరు, తమ విద్యాసంస్థలను బజారుకు ఈడుస్తూ డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేస్తున్నాడంటూ మరొకరు పరస్పరం ఫిర్యాదులు చేశారు. గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లికి చెందిన దొరసామి చిత్తూరు నగరంలోని వివేకానంద కళాశాల నిర్వహణపై పలు విషయాలను సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగారు. ఈ నెల 11వ తేదీ ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు కళాశాలను తనిఖీ చేయడానికి వెళ్లడంతో వారితో పాటు దొరసామి కూడా వెళ్లారు. అయితే కళాశాల నిర్వాహకులు సత్యనారాయణ, నాగరాజు శెట్టి, సురేంద్ర రెడ్డి, నవీన్ తదితరులు తనని అడ్డుకుని కులం పేరిట దుర్భాషలాడారని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దొరసామి తమ కళాశాలపై లేనిపోని ఆరోపణలు చేస్తూ బ్లాక్ మెయిల్ చేశారని కళాశాల నిర్వాహకులు సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### 28న నాలుగో విడత కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈ నెల 28న నాలుగో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 28న జిల్లాలోని 9 ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో, ఈ నెల 30వతేదీన 10 ప్రైవేట్ కళాశాలల్లో నాలుగో విడత అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 26వ తేదీ లోపు www. iti. ap. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 77999 33370, 77992 01479ను సంప్రదించాలని కోరారు.

## డీఆర్ శ్రీనివాసరావు బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) శ్రీనివాసరావును ఏలూరు జిల్లా డీఆర్‌గా బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో ఇంక ఎవరినీ నియమించలేదు. జిల్లా మార్కెట్ వాల్యూ ఆడిట్ రిజిస్ట్రార్‌గా మునిశంకరయ్య నియమితులయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఐజీగా ఉన్న గిరిబాబును అదే స్థానంలో కొనసాగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### జిల్లా జూడో జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అధికారుల బృందం

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా బాల, బాలికల ఎస్‌జీఎఫ్ అండర్–14 జూడో జట్ల ఎంపిక బుధవారం వడమాలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. హెచ్‌ఎం కరుణానవనీతం అధ్యక్షతన తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపికకు డీఈఓ శేఖర్ హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి 200మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పీడీలు జేమ్స్, సాంబశివరావు, జయప్రకాష్, శ్రీధర్, పుష్పవాణి, ప్రసన్నకుమారి, త్రిలోకసుందరి ఎంపిక నిర్వహించారు.

**బాలుర జట్టు**

హేమసాయి, భానుప్రసాద్ (మంగళం), దిలీప్, గౌతమ్ (రామకుప్పం), నాగరాజు (పల్లం), మణికంఠ, గంగాధర్ (తిరుపతి)

**బాలికల జట్టు**

లీల, వెన్నెల (వడమాలపేట), అనూష, పూజిత (రేణిగుంట), భావన, పూజ (మంగళం), గీతిక (తిరుపతి)

# డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీఓ, ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌లను బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు సాధారణ బదిలీ ప్రక్రియలో బదిలీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బదిలీ అయిన డిప్యూటీ తహసీల్దార్లు వెంటనే నూతన స్థానాల్లో చేరాలని సూచించారు. విధుల్లో చేరని వారిపై శాఖాపరంగా క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

వంశీకృష్ణ (గుడిపాల నుంచి పుంగనూరు), జయసింహ (డీఎస్‌ఓ కార్యాలయం నుంచి పులిచెర్ల), కిరణ్‌కుమార్ (నగరి నుంచి సోమల), అనిల్ కుమార్ (బంగారుపాళ్యం నుంచి చౌడేపల్లె), హుస్సేన్ (కలెక్టరేట్ నుంచి సదుం), తులసిరామ్ (జీడీనెల్లూరు నుంచి నగరి), మునికృష్ణ (పూతలపట్టు నుంచి నింద్ర), కిరణ్ (చిత్తూరు నుంచి విజయపురం), జయంతి (యాదమరి నుంచి జీడీ నెల్లూరు), రమేష్‌బాబు (కలెక్టరేట్ నుంచి వెదురుకుప్పం), నాగరాజు (విజయపురం నుంచి పాలసముద్రం), కళ్యాణి (గుడిపాల నుంచి బంగారుపాళ్యం), నరేష్‌కుమార్ (తవణంపల్లె నుంచి చిత్తూరు అర్బన్), అశోకన్ (విజయపురం నుంచి చిత్తూరు రూరల్), త్యాగరాజు (చిత్తూరు రూరల్ నుంచి కార్వేటినగరం), స్వరూపరాణి (కార్వేటినగరం నుంచి గుడిపాల), పార్థసారథి (కలెక్టరేట్ నుంచి యాదమరి), సుధాకర్ (ఐరాల నుంచి తవణంపల్లె), మహేష్‌కుమార్ (పెనుమూరు నుంచి ఐరాల), శివజ్యోతి (కుప్పం నుంచి పలమనేరు), శివకుమార్ (కలెక్టరేట్ నుంచి గంగవరం), ప్రసన్నకుమార్ (గంగవరం నుంచి పెద్దపంజాణి), రమణమూర్తి (గుడుపల్లె నుంచి బైరెడ్డిపల్లె), సూర్యప్రకాష్ నాయక్ (పలమనేరు నుంచి కుప్పం), అశోక్‌కుమార్ (చిత్తూరు రూరల్ నుంచి రామకుప్పం)ను బదిలీ చేశారు.

**రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్లు**

బాలాజీ (వి.కోట నుంచి పుంగనూరు), లోకేష్ (రొంపిచెర్ల – రీసర్వే నుంచి మండల కార్యాలయం), దిలీప్ కుమార్ (రామకుప్పం నుంచి పులిచెర్ల), మాధవి (చౌడేపల్లె), కుమార్ (సదుం), నీలావతి (కార్వేటినగరం నుంచి నగరి), మేఘవర్ణం (నగరి నుంచి నింద్ర), ఏకాంబరం (పులిచెర్ల నుంచి విజయపురం), ధనంజేయులు (చిత్తూరు అర్బన్ నుంచి జీడీనెల్లూరు), వాణి (పులిచెర్ల నుంచి పెనుమూరు), లక్ష్మీ (కుప్పం నుంచి ఎస్ఆర్‌పురం), వెంకటరమణ (తవణంపల్లె నుంచి వెదురుకుప్పం), రూపాదేవి (ఐరాల నుంచి గుడిపాల), కళ్యాణ్ (ఎస్ఆర్‌పురం నుంచి పూతలపట్టు), మోహన్‌రాజ (చిత్తూరు నుంచి యాదమరి), విజయకృష్ణ (జీడీ నెల్లూరు నుంచి తవణంపల్లె), ఖాదర్ (రొంపిచెర్ల నుంచి ఐరాల), గిరిజాకుమారి (చిత్తూరు నుంచి పలమనేరు), చంద్రశేఖర్ (వి.కోట నుంచి శాంతిపురం), నారాయణరెడ్డి (జీడీ నెల్లూరు నుంచి కుప్పం), కిషోర్ (బైరెడ్డిపల్లి నుంచి వి.కోట), అష్రఫ్ అలీషా (నగరి నుంచి గుడుపల్లె), పన్నీర్ సెల్వం (చిత్తూరు నుంచి రామకుప్పం), ఇబ్రహీం (బంగారుపాళ్యం నుంచి సోమల), బాబు (పలమనేరు నుంచి బంగారుపాళ్యం), నాగేశ్వర (చౌడేపల్లె నుంచి చిత్తూరు రూరల్)ను బదిలీ చేశారు.

**ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు**

రూప శ్రీలక్ష్మీ (నగరి), మాధవీలత (నింద్ర నుంచి జీడీనెల్లూరు), కోమల (వెదురుకుప్పం నుంచి పలమనేరు), గీతాంజలి (పలమనేరు నుంచి కుప్పం), గౌరిశంకర్ (అన్నమయ్య జిల్లా నుంచి నగరి), విజయ్‌రెడ్డి (అన్నమయ్య జిల్లా నుంచి నగరి), జయలక్ష్మి (పలమనేరు), రిషివర్మ (పలమనేరు నుంచి కుప్పం), దేవరాజు (కుప్పం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం), శ్యాం ప్రసాద్‌రెడ్డి (సోమల నుంచి చిత్తూరు), మధుబాబు (పాలసముద్రం నుంచి చిత్తూరు), హరికృష్ణ (పుంగనూరు నుంచి కడా), ప్రకాష్‌బాబు (సోమల నుంచి కడా), నాగరాజు (పుంగనూరు నుంచి కలెక్టరేట్), శ్రీదేవి (కుప్పం నుంచి డీఎస్‌ఓ కార్యాలయం)ని బదిలీ చేశారు.

## రావణబ్రహ్మపై లంబోదరుడి విహారం



రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తున్న లంబోదరుడు

ఐరాల/తవణంపల్లె: కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా బుధవారం వినాయకస్వామి రావణబ్రహ్మ వాహనంపై పురవీధుల్లో విహరించారు. వేకువజామున స్వయంభు వరసిద్ధి వినాయక స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఉభయకర్తలు మేళ తాళాలతో స్వామివారి వాహన సేవకు పూజాసామగ్రి తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు స్వామివారి అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అలంకార మండపం నుంచి ఉత్సవమూర్తులను మోసుకుంటూ తీసుకొచ్చి రావణ బ్రహ్మ వాహనంపై కొలువుదీర్చారు. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం మేళ తాళాలు, కళాకారుల కోలాటలు, చెక్కభజనల నడుమ స్వామివారిని ఊరేగించారు. భక్తులు మంగళ హారతులిచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. రావణబ్రహ్మ వాహన సేవకు పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పపల్లె, సిద్ధంపల్లె, ముద్దరామాపురం గ్రామాల వాసులు ఉభయదారులుగా వ్యవహరించారు.

**నేడు యాళి వాహన సేవ**

ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా గురువారం వరసిద్ధి వినాయకస్వామివారికి యాళివాహన సేవ నిర్వహించనున్నారు. ఉదయం మూలస్థానంలోని వినాయకునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించనున్నారు. రాత్రి వాహన సేవ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.



## ట్రాన్స్‌ఫార్మర్ కోసం రైతు నిరసన



ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి నిరసన చేస్తున్న జగన్నాథరెడ్డి కుటుంబ సభ్యులు

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం పంచాయతీ వినాయకపురం గ్రామానికి చెందిన రైతు జగన్నాథరెడ్డి తన పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చలేదని బుధవారం నిరసన తెలిపాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురై మూడు నెలలైనా ఇంతవరకు విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదంటూ బుధవారం పొలం వద్ద అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ పైకెక్కి నిరసన చేపట్టారు. ఆ రైతు కథనం మేరకు, మూడు నెలల క్రితం తన బోరు మోటారుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దాన్ని బాగు చేయాలంటూ విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. అది తీసుకెళ్లేందుకు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు అయ్యే ఖర్చును కూడా రైతు చెల్లించాడు. అయినప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. వరి నారు నీరు లేక ఎండిపోతోందని వాపోయాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వేడుకుంటున్నాడు.

## రెండు జిల్లాల్లో వీఆర్‌ఓల బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వీఆర్‌ఓలను బదిలీ చేస్తూ ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు 7 గురు వీఆర్‌ఓలను, తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు 6 మంది గ్రేడ్ 1 వీఆర్‌ఓలు, చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు ఇద్దరు గ్రేడ్ 2 వీఆర్‌ఓలు, తిరుపతి జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు ఇద్దరు గ్రేడ్ 2 వీఆర్‌ఓలను బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బదిలీ అయిన వారు వెంటనే నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.



## ఆన్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇసుక బుకింగ్ ఇకపై ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పలు అంశాలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని చిత్తూరు రూరల్ మండలం పాలూరు, దిగువమాసాపల్లి గ్రామాల్లో రెండు ఇసుక స్టాక్ పాయింట్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ రెండు స్టాక్ పాయింట్లలో ఈ నెల 19వ తేదీ నుంచి ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ప్రజలు www.sand.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. బుక్ చేసుకున్న ఒకటి, రెండు రోజుల్లో ఇసుకను ఇంటి వద్దకే సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇసుక సరఫరా కేంద్రం నుంచి ఇంటి వద్దకు గల దూరానికి సంబంధించి రవాణా చార్జీలను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పనిదినాల్లో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోర్టల్‌లో ఇసుక నమోదు చేసుకునేందుకు అనుమతి ఉంటుందన్నారు. దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇసుకను ఆర్డర్ చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ చెల్లింపులు మాత్రమే అంగీకరించనున్నట్లు చెప్పారు. ఇసుక సమస్యలపై, chittoorsand75 @gmail. com లేదా 08572–299509 నెంబర్‌లో తెలియజేయవచ్చని కలెక్టర్ వెల్లడించారు.

## డెంగీతో బాలిక మృతి



మేఘన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట : మండలంలో డెంగీ జ్వరంతో బాలిక మంగళవారం రాత్రి మృతి చెందింది. పట్టణంలోని సత్యసాయి నగర్‌కు చెందిన హరి కుమార్తె మేఘన (14) 8వ తరగతి చదువుతోంది. బాలికకు జ్వరంతో రావడంతో వారం క్రితం స్థానిక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నయం కాకపోవడంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. డెంగీ వల్ల మృతి చెందినట్లు బెంగళూరు ఆస్పత్రిలో నిర్వాహకులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం బాధితుడు హరి నివాసానికి చేరుకుని మేఘన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. హరి ఇంటి సమీపంలో అపరిశుభ్రంగా ఉన్న గంగమ్మ ఏరును జెడ్పీ చైర్మన్ పరిశీలించారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితుడు

పెద్దపంజాణి: కర్ణాటక నుంచి మండలంలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సహదేవి తెలిపారు. ఆమె బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ మండల సరిహద్దులోని రాజుపల్లి చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. మండలంలోని గళ్లావారిపల్లెకు చెందిన క్రిష్ణప్ప కుమారుడు శ్రీరాములు హోండా డుయో ద్విచక్ర వాహనంలో 1008 టెట్రా ప్యాకెట్లు తీసుకువస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. ద్విచక్ర వాహనంతో పాటు మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.